సాక్షి
విశాఖపట్నం
ఆదివారం । 9 । మార్చి । 2025



వైఎస్ జగన్ హయాంలోనే మహిళా సాధికారత





మహిళల భద్రతకు ప్రాధాన్యం

జిల్లాలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా జరిగింది. జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో వీఎంఆర్డీఏ చిల్డ్రన్ ఎరీనాలో, మద్దిలపాలెంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో, బీచ్‌రోడ్డులో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. 8లో



• మామూళ్లు.. గమ్మత్తుగా!

ఒక్కో దుకాణానికి రూ.2.5 లక్షలు!



- మద్యం షాపుల నుంచి నెలవారీ వసూళ్లు మరూ
- బెల్టు షాపులకు రూ.10 అధిక ధరకు అమ్మకం
- సమావేశం పెట్టి మరీ టార్గెట్ విధింపు
- వచ్చే ఏడాది నుంచి రూ.3 లక్షలు ఇవ్వాలని ఆదేశాలు
- బెంగళూరు నుంచి వచ్చిన నేత ద్వారా కలెక్షన్లు

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం:

ఇప్పటికే ప్రైవేటు పీఏ వ్యవహారంలో విమర్శలు ఎదుర్కొంటున్న కూటమి నేత ఒకరు... ఇప్పుడు కలెక్షన్ల కోసం ఏకంగా బెంగళూరు నుంచి ఓ వ్యక్తిని తీసుకొచ్చినట్టు తెలుస్తోంది. ముందుగా నియోజకవర్గంలోని మొత్తం మద్యం షాపుల నుంచి మామూళ్లు వసూలు చేయాలని భావించారు. ఇందుకు అనుగుణంగా మద్యం షాపు సిండికేట్లతో గత నెలలో సమావేశం ఏర్పాటు చేసి మరీ టార్గెట్లు ఫిక్స్ చేసినట్టు తెలుస్తోంది. ప్రతి మద్యం షాపు యజమాని ప్రతి నెలా రూ.2.5 లక్షల చొప్పున చెల్లించాలని ఆదేశాలు జారీ అయినట్టు సమాచారం. ఇందుకు ప్రతిఫలంగా సదరు ప్రైవేటు మద్యం దుకాణదారుడు బెల్టు షాపులకు ఎమ్మార్పీ మీద రూ.10 అధికంగా విక్రయించుకునేలా ఏర్పాట్లు చేశారు. అంతేకాకుండా ఆయా దుకాణాల పరిధిలో బెల్టు షాపులకు మద్యం సరఫరా బాధ్యత కేవలం వారికే దక్కేలా నిర్ణయించినట్టు తెలుస్తోంది. ఆయా మద్యం షాపులతో పాటు బెల్టు షాపుల జోలికి ఎక్సైజ్ శాఖ అధికారులు వెళ్లకుండా కూడా ఆదేశాలు జారీ కావడం విశేషం. వచ్చే ఏడాది నుంచి ప్రతి నెలా వసూళ్ల మొత్తం రూ.3 లక్షలకు పెంచనున్నట్టు కూడా ముందుగానే ప్రకటించినట్టు సమాచారం. మొత్తంగా ఒక ప్రైవేటు పీఏ వ్యవహారంలో విమర్శల నేపథ్యంలో దూరంగా పెట్టిన సదరు నేత.. ఇప్పుడు బెంగళూరు నుంచి వచ్చిన మరో వ్యక్తి ద్వారా వసూళ్లకు దిగడం చర్చనీయాంశమవుతోంది.

విచ్చలవిడిగా బెల్టు షాపులు!

ఇప్పటికే పేకాట, కోడి పందేల వ్యవహారంలో **వార్తలకెక్కిన** సదరు నేత.. ఇప్పుడు విచ్చలవిడిగా **మద్యం బెల్టు** దుకాణాలకు కూడా గ్రీన్‌సిగ్నల్ **ఇచ్చారు. అం**తేకాకుండా పేకాట డెన్‌ల నిర్వహణలో **కొంత మొత్త**ం వసూలు చేసేందుకు మరీ అనుమతి **ఇచ్చారు. వా**టి జోలికి వెళ్లకుండా కూడా కొద్దిరోజుల **పాటు నియ**ంత్రించగలిగారు. అయితే అంతర్గత విభేదాల కారణంగా ఈ వ్యవహారం కాస్తా బయటకు వచ్చింది. దీంతో తాత్కాలికంగా పేకాట శిబిరాలు మూతపడ్డాయి. ఇక కోడి పందేల శిబిరాలు ఏ నియోజకవర్గంలో లేని విధంగా ఏకంగా మూడు ప్రాంతాల్లో ఏర్పాట్లు చేశారు. అధికారికంగా సదరు నేత పాల్గొనకపోయినా వారి అండతోనే ఈ వ్యవహారం నడిచింది. దీంతో అటువైపు పోలీసులు కన్నెత్తి చూడలేదు. పైగా కోడి పందేల శిబిరాల ప్రాంతంలో విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు కూడా జరిగాయి. బహిరంగంగానే మద్యాన్ని విక్రయించారు. వీటి ఏర్పాట్లకు కూడా వేలం పాట నిర్వహించి మరీ వసూళ్లకు తెగబడ్డారు. మరోవైపు ఇప్పటికే సదరు నేత నియోజకవర్గంలో భారీగా బెల్టు షాపులు వెలిశాయి. బెల్టు షాపుల కోసం వేలం పాట నిర్వహించిన వీడియోలు కూడా బయటకు వచ్చాయి.

బెంగళూరుకు చెందిన వ్యక్తి ద్వారా..!

వాస్తవానికి సదరు నేతకు ఏళ్లుగా నమ్మినబంటుగా ఉన్న వ్యక్తి ద్వారా అన్ని వ్యవహారాలు నడిపేవారు. అయితే సదరు వ్యక్తిపై సొంత పార్టీ నేతలే ఫిర్యాదు చేయడంతో పక్కన పెట్టినట్టు వార్తలు వచ్చాయి. ఆ స్థానంలో తనకు నమ్మిన బంటుగా ఉన్న మరో వ్యక్తిని బెంగళూరు నుంచి ప్రత్యేకంగా పిలిపించినట్టు ఆ పార్టీ నేతలే బహిరంగంగా చర్చించుకుంటున్నారు. మద్యం సిండికేట్ల ద్వారా వసూలు చేసే మొత్తం కూడా సదరు బెంగళూరు వ్యక్తి చేతికి చేరుతున్నట్టు తెలుస్తోంది. మరోవైపు కొద్దిరోజుల క్రితం సెజ్‌లోని ఒక కంపెనీలో సీసీ కెమెరాలను బిగించే పని ఇప్పించడం కోసం కూడా రూ.3 లక్షల మేర వసూలు చేసినట్టు తెలుస్తోంది. ఈ తతంగమంతా కూడా బెంగళూరు వ్యక్తి ద్వారానే నడిచినట్టు సమాచారం. మొత్తంగా పీఏలు మారుతున్నారు తప్ప వసూళ్ల కార్యక్రమం మాత్రం తమకు తప్పడం లేదని సొంత పార్టీ నేతలే వ్యాఖ్యానిస్తున్నారు. బెంగళూరు వ్యక్తిపై కూడా ఫిర్యాదు చేసేందుకు ఆ పార్టీ నేతలే సిద్ధమవుతున్నట్టు తెలుస్తోంది.

అయినా సదరు నేత అండదండలతో చర్యలు తీసుకోలేదని విమర్శలున్నాయి. కేవలం ఈ నియోజకవర్గంలోనే ఏకంగా వందకుపైగా బెల్టు షాపులు ఏర్పాటైనట్టు సమాచారం. మద్యం దుకాణదారులు ఆయా బెల్టు షాపులకు ఎమ్మార్పీకి రూ.10కి అధికంగా మద్యం విక్రయించుకుంటున్నారు. ఇందులో వచ్చే సగం ఆదాయాన్ని సదరు నేతకు ముట్టచెబుతున్నట్టు తెలుస్తోంది.

మిల్క్ బ్యూటీ మెరుపులు

రాడిసన్ బ్లూలో ఫ్యాషన్ షో అదుర్స్

కొమ్మాది: కళ్లు మిరుమిట్లు గొలిపే లైటింగ్.. ఉర్రూతలూగించేలా డీజే పాటలు.. ఒయ్యారాలు పలికిస్తూ అందమైన మోడల్స్ ర్యాంప్ వాక్‌తో ఫ్యాషన్ షో అదరహో అనిపించింది. రాడిసన్ బ్లూ రిసార్ట్‌లో శనివారం సాయంత్రం నిర్వహించిన బ్లెండర్స్ ప్రైడ్ ఫ్యాషన్ టూర్ కార్యక్రమం వీక్షకులను కనువిందు చేసింది. సినీ తార తమన్నా భాటియా ముఖ్య అతిథిగా హాజరై ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. నల్లటి మోడ్రన్ డ్రెస్‌లో ర్యాంప్‌పై మిల్క్ బ్యూటీ వాక్ చేయడంతో సందర్శకులు ఫిదా అయిపోయారు. ఇతర మోడల్స్ కూడా ఆధునిక దుస్తుల్లో ర్యాంప్‌పై సందడి చేశారు. ఈ ఫ్యాషన్ షోను చూసేందుకు భారీ సంఖ్యలో సందర్శకులు తరలివచ్చారు.

వైజాగ్ అంటే చాలా ఇష్టం : తమన్నా

వైజాగ్ అంటే తనకు చాలా ఇష్టమని సినీ హీరోయిన్, మిల్కీ బ్యూటీ తమన్నా అన్నారు. ఫ్యాషన్ షో అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. విశాఖలో జరిగిన అనేక కార్యక్రమాల్లో పాల్గొన్నానని, కానీ ఇటువంటి ఫ్యాషన్ షోలో వాక్ చేయడం ఇదే తొలిసారి అని చెప్పారు. ర్యాంప్‌పై వాక్ చేస్తున్న సమయంలో ప్రేక్షకులందరూ హార్ట్ సింబల్ చూపిస్తుంటే.. ఆనందంతో నా హార్ట్ బీట్ పెరిగిందన్నారు. సినిమాలపై స్పందిస్తూ.. ఈ మధ్య కాలంలో రీ రిలీజ్ ట్రెండ్ నడుస్తోందన్నారు. తను నటించిన ఆవారా సినిమా రీ రిలీజ్ అయి మంచి కలెక్షన్లు రాబట్టిందని సంతోషం వ్యక్తం చేశారు. త్వరలో హ్యాపీడేస్ సినిమాను కూడా రీ రిలీజ్ చేసే అవకాశముందన్నారు. ఈ సినిమా ఈ మధ్యే చేసినట్లు అనిపిస్తోందన్నారు. హర్రర్ జోనర్‌లో మంచి స్క్రిప్ట్లు వస్తే చేయడానికి సిద్ధం ఉన్నట్లు చెప్పారు.

ఎన్టీఆర్ వైద్య సేవ ఉద్యోగుల ఆందోళన బాట

ప్రతి సోమవారం విధుల బహిష్కరణ

మహారాణిపేట: డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ పథకంలో పనిచేస్తున్న ఉద్యోగులు సమస్యల సాధన కోసం ఆందోళన బాట పడుతున్నారు. మార్చిలో వచ్చే మూడు సోమవారాలు విధులు బహిష్కరిస్తున్నట్టు ఏపీ వైద్య సేవ ఎంప్లాయిస్ జేఏసీ(ఏపీఏఎంసీవోఈయూహెచ్-146) యూనియన్ నాయకులు ప్రకటించారు. ఈ నెల 10, 17, 24 తేదీల్లో వచ్చే సోమవారాల్లో రాష్ట్ర వ్యాప్తంగా ఎన్టీఆర్ వైద్య సేవ ఉద్యోగులంతా విధులు బహిష్కరించి నిరసన తెలియజేయనున్నట్టు నాయకులు తెలిపారు. అందులో భాగంగా జిల్లాలో మూడు సోమవారాలు విధులు బహిష్కరించి ఆరోగ్యశ్రీ జిల్లా సమన్వయకర్త అధికారి ఆఫీస్ దగ్గర శాంతియుత నిరసన తెలపాలని నిర్ణయం తీసుకున్నట్టు పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్టు పథకాన్ని బీమా పరిధిలోకి తీసుకెళ్లేందుకు రంగం సిద్ధం చేస్తోందని, ఆప్కాస్ రద్దు దిశగా ఇప్పటికే అడుగులేసిందని వాపోయారు. ఏప్రిల్ నుంచి బీమా సేవలు కొనసాగుతాయని ప్రభుత్వం ప్రకటించడంతో రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో వివిధ కేటగిరీల్లో పనిచేస్తున్న ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు.

లోక్‌అదాలత్‌లో 7వ స్థానంలో విశాఖ

6,498 కేసుల రాజీ • రాజీ రుసుముగా రూ.22 కోట్లు



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి అలపాటి గిరిధర్

విశాఖ లీగల్: న్యాయ సేవ ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో జరిగిన మెగా లోక్‌అదాలత్‌లో శనివారం సాయంత్రం 8 గంటల సమయానికి 6,498 కేసులు రాజీ అయ్యాయి. రాజీ రుసుము కింద రూ. 22 కోట్లు వరకు వసూలైంది. రాష్ట్రంలో విశాఖ నాలుగో స్థానంలో ఉందని, పూర్తి వివరాలకు సమయం పడుతుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్ తెలిపారు. కేసుల రాజీకి ఉమ్మడి విశాఖ జిల్లా పరిధిలో 30 బెంచ్‌లు ఏర్పాటు చేశారు.

వైఎస్సార్‌సీపీ ఇంటలెక్చువల్ ఫోరం వైస్ ప్రెసిడెంట్‌గా లజపతిరాయ్



లజపతిరాయ్



విజయకుమార్



కాళిదాసురెడ్డి

సాక్షి, విశాఖపట్నం: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర ఇంటలెక్చువల్ ఫోరం విభాగం కమిటీ నియామకం జరిగింది. వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఇంటలెక్చువల్ ఫోరం విభాగం కమిటీ వైస్ ప్రెసిడెంట్‌గా ప్రొఫెసర్ హెచ్.లజపతిరాయ్, అధికార ప్రతినిధిగా ప్రొఫెసర్ కిర్ల విజయకుమార్, ఫోరం సెక్రటరీగా నీలాపు కాళిదాసు రెడ్డిని నియమించారు. ఈ మేరకు శనివారం కేంద్ర పార్టీ కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది.

ఖాకీ కథా చిత్రం!

- మేఘాలయ హోటల్‌లో ఎన్ఆర్ఐ మహిళ అనుమానాస్పద మృతి
- ఈ వ్యవహారంలో పోలీసుల తీరుపై అనేక అనుమానాలు
- ఆ గదిలో ఉన్న ఆమె మిత్రుడిని కాపాడే ప్రయత్నం?
- కేసు మాఫీకి భారీగా ఒప్పందం జరిగినట్లు ఆరోపణలు



విశాఖ సిటీ: విశాఖలో ఖాకీ క్రైమ్ కథా చిత్రం.. సస్పెన్స్ థ్రిల్లర్ సినిమాను తలపిస్తోంది. ఒక ఎన్ఆర్ఐ మహిళ, ఒక వైద్యుడు మధ్య ఏం జరిగిందన్న అంశం హాట్ టాపిక్‌గా మారింది. విశాఖకు చెందిన ఒక వైద్యుడు రెండు వారాలకు పైగా హోటల్‌లోనే ఎందుకు బస చేశాడు? అమెరికా పౌరసత్వం కలిగిన మహిళ విశాఖకు ఎందుకు వచ్చింది? ఆమె ఆ వైద్యుడు ఉన్న రూమ్ నెంబర్ 229లో ఎందుకు ఉంది? వారి మధ్య గొడవ జరగడానికి గల కారణమేంటి? కొద్ది నిమిషాల్లోనే ఆమె బాత్‌రూమ్‌లో నగ్నంగా విగతజీవిగా ఎలా మారింది? పోలీసులకు ఎవరు సమాచారమిచ్చారు? కిటికీ గానీ, హుక్‌గానీ లేని బాత్‌రూమ్‌లో ఆమె ఎలా ఉరి వేసుకుంది? ఆ సమయంలో వైద్యుడు అక్కడే ఉన్నాడా? రెండు రోజుల పాటు ఈ ఘటన బయటకు రాకుండా పోలీసులు ఎందుకు గోప్యంగా ఉంచారు? ఎఫ్ఐఆర్‌లో వైద్యుడి పేరును చేర్చారా? లేదా? అతడి సెల్‌ఫోన్‌లో ఎవరి ప్రైవేట్ వీడియోలు ఉన్నాయి? హోటల్ గదిలో పోలీసులు ఎటువంటి సామగ్రి గుర్తించారు? ఇంటెలిజెన్స్ అధికారులకు కూడా ఈ కేసు సమాచారం ఇవ్వకపోవడం వెనుక మర్మమేంటి?

ఇలా ఒకటి కాదు.. రెండు కాదు.. అనేక ఊహకందని ప్రశ్నలు థ్రిల్లర్ సినిమాకు మించి సస్పెన్స్‌ను క్రియేట్ చేస్తున్నాయి. అయితే విశాఖ పోలీసులు మాత్రం ఆ ప్రశ్నలన్నింటినీ పక్కనపెట్టి.. సింపుల్‌గా అనుమానాస్పద మృతి అని తేల్చేశారు. ఈ కేసు విషయంలో పోలీసుల వ్యవహార శైలి తీవ్ర వివాదాస్పదమవుతోంది. గురువారం మధ్యాహ్నం ఘటన జరిగితే.. అదే రోజు సాయంత్రం ఎఫ్ఐఆర్ నమోదు చేసి కూడా శనివారం వరకు బయటకు రాకుండా ఉంచడం అనేక అనుమానాలకు తావిస్తోంది. ఇందుకోసం రూ.కోటి వరకు ఒప్పందం జరిగిందన్న ఊహాగానాలు చెలరేగుతున్నాయి. పోలీసుల తీరే ఈ ఆరోపణలు చెలరేగడానికి తావిస్తోంది.

వైద్యుడు ఫ్యామిలీ ఫ్రెండ్?

విశాఖకు చెందిన వైద్యుడు పిల్లా శ్రీధర్ రెండు వారాలకు పైగా హోటల్ మేఘాలయలో బస చేస్తున్నారు. సీతమ్మధార ప్రాంతానికి చెందిన కాకర్లపూడి రోజా ప్రస్తుతం వివాహం చేసుకొని యూఎస్‌లో స్థిరపడ్డారు. రోజా కుటుంబానికి శ్రీధర్ ఫ్యామిలీ ఫ్రెండ్‌గా తెలుస్తోంది. నాలుగు రోజుల క్రితం రోజా విశాఖకు వచ్చి శ్రీధర్ ఉన్న గదిలోనే ఉంటోంది. అయితే గత గురువారం వారిద్దరి మధ్య తీవ్ర వాగ్వాదం జరిగినట్లు సమాచారం. కొద్ది నిమిషాల్లోనే ఆమె బాత్‌రూమ్‌లో అనుమానాస్పదంగా మృతి చెందింది.

పోలీసులకు సమాచారం ఇచ్చింది ఎవరు?

ఆమె మృతి చెందిన విషయాన్ని పోలీసులకు ఎవరు సమాచారం ఇచ్చారన్న విషయం సస్పెన్స్‌గా మారింది. అయితే మహిళ బాత్‌రూమ్‌లో ఉరి వేసుకొని చనిపోయిందని హోటల్ మేనేజర్ ఫిర్యాదు చేసినట్లు పోలీసులు చెబుతున్నారు. రూమ్‌లో శ్రీధర్ మాత్రమే ఉంటే.. హోటల్ మేనేజర్‌కు ఆమె చనిపోయిందన్న విషయం ఎలా తెలిసింది? ఆత్మహత్య చేసుకోవాలనుకునే రోజా ఎందుకు నగ్నంగా ఉంది. ఫ్యాన్ హుక్, కిటికీ గానీ లేని బాత్‌రూమ్‌లో ఆమె ఎలా ఉరి వేసుకుంది? ఇలా అనేక ప్రశ్నలకు సమాధానాలు దొరకాల్సి ఉంది. పోలీసులు వచ్చిన సమయంలో శ్రీధర్ రూమ్‌లోనే ఉన్నారా? పోలీసులు అతడి పేరును ఎఫ్ఐఆర్‌లో నమోదు చేశారా? లేదా అన్న విషయం తేలాల్సి ఉంది.

ఎందుకంత గోప్యం..

గురువారం మధ్యాహ్నం ఘటన జరిగితే అదే రోజు సాయంత్రం 5.30కి ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. శుక్రవారం రాత్రి విషయం బయటకు పొక్కడంతో మీడియా త్రీటౌన్ సీఐ రమణయ్యను సంప్రదించారు. అసలు అటువంటి ఘటనే జరగలేదని, తప్పుడు సమాచారమని చెప్పి తప్పించుకున్నారు. శనివారం ఉదయం ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళితే.. అసలు విషయం వెలుగులోకి వచ్చింది. ఇప్పటికీ కూడా ఈ కేసు పూర్తి వివరాలను పోలీసులు బయటకు వెల్లడించకపోవడం గమనార్హం.

కేసు మాఫీకి ప్రయత్నాలు?

ఈ కేసును మాఫీ చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయన్న ఊహాగానాలు చెలరేగుతున్నాయి. ఎన్ఆర్ఐ మహిళది హత్యా? ఆత్మహత్య? అన్నది తేలాల్సి ఉంది. ఆమెను హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించే ప్రయత్నాలు జరుగుతున్నాయన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఆ వార్తలకు పోలీసుల వ్యవహార శైలే బలాన్ని చేకూరిస్తున్నాయి. ఈ ఘటన బయటకు రాకుండా ఉండేందుకు భారీ స్థాయిలో ఒప్పందాలు జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇందులో ఒక ఉన్నతాధికారి పాత్ర కూడా ఉన్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. అయితే శనివారం మహిళ మృతదేహానికి కేజీహెచ్‌లో పోస్టుమార్టం నిర్వహించారు. ఆ నివేదిక ఆధారంగా కేసులో చర్యలు తీసుకుంటామని నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి చెబుతున్నారు.

మహిళల భద్రతకు ప్రాధాన్యం

- జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి
- ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం



ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శన



చెక్కును అందజేస్తున్న ఇన్‌చార్జి మంత్రి డోలా

బీచ్‌రోడ్డు: రాష్ట్ర ప్రభుత్వం మహిళల భద్రతకు అధిక ప్రాధాన్యమిస్తోందని, అందులో భాగంగానే 'శక్తి' యాప్‌ను ప్రారంభిస్తున్నట్లు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి అన్నారు. సిరిపురంలోని వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్ ఎరీనాలో శనివారం జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఇన్‌చార్జి మంత్రి మాట్లాడుతూ ప్రతి నియోజకవర్గంలో విజయాలు సాధించిన మహిళలను గుర్తించి, వారిని గౌరవించాలన్నారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. మహిళల హక్కులు, సమానత్వం, సాధికారత గురించి చర్చించాల్సిన అవసరం ఉందన్నారు. విద్య, ఉద్యోగ రంగాల్లో మహిళలు పురుషులతో సమానంగా ఉన్నత విజయాలు సాధిస్తున్నారని కొనియాడారు. ప్రభుత్వం ఇళ్ల పట్టాలను మహిళల పేరునే మంజూరు చేస్తుందని తెలిపారు. మహిళలపై దాడులు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మహిళల ఆర్థిక స్వావలంబన చేకూర్చుకునేందుకు షియో ఆటోలు, ద్విచక్ర వాహనాలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని స్వయం సహాయక బృందాలు తయారుచేసిన ఉత్పత్తులను ఆన్‌లైన్‌లో అమ్మకాల ద్వారా లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్ చోటు దక్కించుకోనున్నాయని వెల్లడించారు. కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా, సామాజికంగా ఉన్నత స్థితికి చేరేందుకు ప్రభుత్వం అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తోందన్నారు. సెల్ఫ్ హెల్ప్ గ్రూపుల ద్వారా ప్రతీ మహిళ ఆర్థికంగా స్థిరపడాలన్నారు. జిల్లాలో ర్యాపిడో ద్వారా 200 మంది మహిళలకు ఉపాధి కల్పిస్తున్నట్లు చెప్పారు. అనంతరం కళాకారులు, చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. తర్వాత మహిళా సంఘాలకు చెక్కులు పంపిణీ చేశారు. వ్యాసరచన, క్రీడలు, తదితర పోటీల్లో విజేతలకు ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు ప్రదానం చేశారు. వివిధ రంగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన మహిళలను ఘనంగా సన్మానించారు. మహిళా సంఘాల లబ్ధిదారులకు ర్యాపిడో స్కూటీలు, ఆటోలను మంత్రి పంపిణీ చేశారు. కార్యక్రమ ప్రాంగణంలో మహిళలు ఏర్పాటు చేసిన స్టాళ్లను మంత్రి పరిశీలించారు. పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, పల్లా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణ బాబు, విష్ణుకుమార్ రాజు, మహిళా శిశు సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ జి చిన్నయిదేవి, విశాఖ జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు వై.గంగాభవానీ, జిల్లా సమైక్య కార్యదర్శి సూరమ్మ తదితరులు పాల్గొన్నారు.

పీఎం అజయ్ పథకం చెక్కు అందజేత

ఎంవీపీకాలనీ: జిల్లాలోని ఎస్‌హెచ్‌జీ మహిళలకు పీఎం అజయ్ ఉన్నతి పథకంలో భాగంగా రూ.35 లక్షల చెక్కును అందజేశారు. ఈ పథకం ద్వారా రూ.50 వేల రాయితీ రుణం కోసం జిల్లాలోని 25 మంది లబ్ధిదారులను ఎంపిక చేసినట్లు ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సత్యపద్మ తెలిపారు. ఈ నిధుల చెక్కును మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి సమక్షంలో లబ్ధిదారులకు అందజేసినట్లు వివరించారు.

జగన్ హయాంలోనే మహిళా సాధికారత

- మాజీ మంత్రి గుడివాడ్ అమర్‌నాథ్
- వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం



కేక్ కట్ చేస్తున్న మాజీమంత్రి గుడివాడ అమర్‌నాథ్, మేయర్ గొలగాని హరివెంకటకుమారి, జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు పేడాడ రమణికుమారి. చిత్రంలో పార్టీ మహిళా నేతలు

సాక్షి, విశాఖపట్నం: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలోనే మహిళా సాధికారత, స్వావలంబన లక్ష్యంగా పాలన సాగిందని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీమంత్రి గుడివాడ అమర్‌నాథ్, మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, మాజీ ఎంపీ గొడ్డేటి మాధవి, మాజీ ఎమ్మెల్యేలు కె.భాగ్య లక్ష్మి, శోభా హైమావతి అన్నారు. మద్దిలపాలెంలోని పార్టీ కార్యాలయంలో జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు పేడాడ రమణికుమారి ఆధ్వర్యంలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అమర్‌నాథ్ కేక్ కట్ చేసి.. రమణికుమారికి తినిపించారు. మహిళలంతా స్వీట్లు పంచుకుని సంబరాలు చేసుకున్నారు. అనంతరం వైఎస్సార్ సీపీలో కీలకంగా పనిచేస్తున్న మహిళలను సత్కరించారు. తర్వాత అమర్‌నాథ్ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ఐదేళ్ల పాల నలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాల పథకాలకు సంబంధించిన డబ్బు లు నేరుగా మహిళల ఖాతాల్లో జమ చేశారని గుర్తు చేశారు. నామినేటెడ్ పదవుల్లో 50 శాతంకుపైగా మహిళలకే కేటాయించారని, చట్టసభల్లో, మంత్రి పదవుల్లో, రాజకీయ పదవుల్లో అన్నింటా మహిళలకే పెద్దపీట వేశారన్నారు. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలు ఇస్తామని మహిళలను మోసం చేసిందని ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వానికి మహిళలు బుద్ధి చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయని హెచ్చరించారు. మేయర్ హరివెంకటకుమారి, మాజీ ఎంపీ మాధవి, మాజీ ఎమ్మెల్యేలు శోభా హైమావతి, భాగ్యలక్ష్మి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మోసపూరిత హామీలతో గద్దెనెక్కిందని ఆరోపించారు. మహిళలకు ఉచిత బస్సు, తల్లికి వందనం, ఆసరా వంటి పథకాలు ఇస్తామని చంద్రబాబు మోసం చేశారని మండిపడ్డారు. పేడాడ రమణి కుమారి మాట్లాడుతూ వైఎస్‌జగన్ దిశ చట్టం ద్వారా మహిళా భద్రతకు అత్యంత ప్రాధాన్యం కల్పించారన్నారు. అనంతరం అతిథులను ఆమె ఘనంగా సత్కరించారు. అలాగే ఫ్యాషన్ డిజైనింగ్ విభాగంలో బండి ప్రియను, అధునాతన కాస్మో టాలజీ అండ్ ట్రికాలజీ క్లినిక్ విభాగంలో రాజ్యలక్ష్మి, బొటిక్ షాపు యాజమాని కోశెట్టి రాజ్యలక్ష్మి, పార్టీ కార్యాలయంలో పని చేసే మీసాల సంధ్యను సన్మానించారు. పార్టీ సమన్వయకర్తలు కేకే రాజు, తిప్పల శ్రీనివాస్ దేవన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే తైనాల విజయకుమార్, తిప్పల గురుమూర్తి రెడ్డి, చింతలపూడి వెంకటరామయ్య, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, కార్పొరేటర్లు తోట పద్మావతి, ముర్రువాణి, సాడి పద్మారెడ్డి, మహిళా నేతలు బి.పద్మావతి, శ్రీదేవీవర్మ, పిల్లి సుజాత, సత్యాల సాగరిక, పల్లా చిన్న తల్లి, అద్దాల కృపా జ్యోతి, బయవరపు రాధా, డా.మంచా నాగ మల్లీశ్వరి, సలాది భాను, రాజేశ్వరి, జోష్ణ, బంగారమ్మ, రత్నం, కాకి పద్మ, రోజారాణి, మళ్ల ధనలత, రజనీ, రామలక్ష్మి, పి.వి.లక్ష్మి, సంషాద్ బేగం, నీలాపు లక్ష్మి, అమ్మాజీ, రేణుక, నాగమణి, పద్మ, రాజీ, సునీత, కుమారి, పద్మ, జోత్స్న, చందక రత్నం, శిరీష, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

స్త్రీలను గౌరవించే సంప్రదాయం మనది

పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి

ఏయూక్యాంపస్: స్త్రీలను అందరూ గౌరవించాలని, వారి పట్ల ఎటువంటి వివక్షత చూపకూడదని నగర పోలీస్ కమీషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో శనివారం బీచ్ రోడ్డులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పోలీస్ విధుల్లో ఉన్న ప్రతీ మహిళకు అంతర్జాతీయ మహిళా దినోత్సవం శుభాకాంక్షలు తెలిపారు. నిత్యం ప్రజల మధ్యన ఉంటూ.. వృత్తి నిర్వహణతో పాటు ఇంటి బాధ్యతలను సైతం మహిళా పోలీసులు ఎంతో సమర్థవంతంగా నిర్వహిస్తున్నారని కొనియాడారు.నగరంలో రాత్రి వేళల్లో సైతం మహిళలు పూర్తి భద్రతతో సంచరించే విధంగా పరిస్థితులు ఉండాలన్నారు. ఆ దిశగా సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పోలీసు శాఖలో దశాబ్దాలుగా సేవలందిస్తూ.. వివిధ హోదాల్లో పనిచేస్తున్న మహిళా పోలీసులు తమ అనుభవాలు, సవాళ్లు, సంతోషకర క్షణాలను అందరితో పంచుకున్నారు. డీసీపీలు అజిత వేజెండ్ల, మేరి ప్రశాంతి, కృష్ణకాంత్ పటేల్, ఎం.లత తదితరులు మాట్లాడారు. అనంతరం పోలీస్ కమిషనర్ సిబ్బందితో కలిసి అల్పాహారం తీసుకున్నారు. సీనియర్ పోలీస్ అధికారులు, సిబ్బందిని సత్కరించారు.

కుటుంబంలో మహిళ పాత్ర కీలకం

సీపీ సతీమణి సువశ్రీ బాగ్చి

మహారాణిపేట: కేజీహెచ్ ఆంకాలజీ విభాగంలో శనివారం మహిళా దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నగర పోలీస్ కమిషనర్ సతీమణి సువశ్రీ బాగ్చి మాట్లాడుతూ ప్రతి ఇల్లు ఆనందమయంగా, ఆరోగ్యంగా ఉండాలంటే మహిళ పాత్ర కీలకమని.. ఝాన్సీ లక్ష్మీబాయిని స్ఫూర్తిగా తీసుకుని ప్రతి ఒక్కరూ సమాజ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. మహిళలు క్యాన్సర్ పట్ల అప్రమత్తంగా ఉంటూ ముందస్తు జాగ్రత్తలు పాటించాలని, విధిగా ఏడాదికి ఒకసారి వైద్య పరీక్షలు చేయించుకోవాలని కోరారు. కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్ మాట్లాడుతూ క్యాన్సర్‌కు సంబంధించిన అంశాలపై కేజీహెచ్‌లో ఉచిత వైద్య సేవలందించే దిశగా అన్ని చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా క్యాన్సర్ వార్డులో చికిత్స పొందుతున్న రోగులు, వారి పిల్లలను కలిశారు. పిల్లలకు అతిథులు బొమ్మలను బహుమతులుగా అందించారు. క్యాన్సర్ రోగులకు మెరుగైన వైద్యం అందిస్తున్న మెడికల్ ఆంకాలజీ విభాగాధిపతి డాక్టర్ కె.శిల్ప సేవలను ప్రశంసించారు. అనంతరం సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్ ముఖ్య అతిథి సువశ్రీ బాగ్చితోపాటు ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్యాదేవి, డాక్టర్ కె.శిల్పలను ఘనంగా సత్కరించారు. డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ జి.వాసవీలత, డీసీహెచ్‌ఎస్ ఆర్ఎంవో డాక్టర్ మెహర్ కుమార్, గ్రేడ్ వన్ నర్సింగ్ సూపరింటెండెంట్ పద్మావతి, ఆయా విభాగాలకు చెందిన నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.



సీపీ సతీమణి సువశ్రీ బాగ్చిని సన్మానిస్తున్న కేజీహెచ్ సూపరింటెండెంట్ శివానంద్

మహిళ ఆత్మహత్య కేసులో ఇద్దరి అరెస్ట్

అల్లిపురం: అప్పు తీసుకున్న వారి ఇంట్లోనే మహిళ ఆత్మహత్యకు పాల్పడిన కేసులో ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. టూటౌన్ సీఐ బి.తిరుమల రావు తెలిపిన వివరాలివి.. అంగడిదిబ్బకు చెందిన బొడ్డు సుగుణ తన భర్తకు తెలియకుండా అచ్చియ్యమ్మపేటకు చెందిన ధనలక్ష్మి వద్ద రూ.లక్ష రుణం తీసుకుంది. అయితే అనుకున్న ప్రకారం ఆమె తిరిగి డబ్బులు చెల్లించలేదు. దీంతో ధనలక్ష్మి బెదిరింపులకు పాల్పడింది. ఈ క్రమంలో సుగుణ.. ధనలక్ష్మి ఇంట్లోనే ఉరివేసుకుంది. మృతురాలి భర్త అప్పన్న ఫిర్యాదు మేరకు పోలీసులు నిందితులు ధనలక్ష్మి, రత్నంలను శనివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

నకిలీ హాల్ టికెట్లు జారీ చేసిన కళాశాలపై కేసు నమోదు

కూర్మన్నపాలెం: ఇంటర్ విద్యార్థులకు నకిలీ హాల్ టికెట్లు జారీ చేసిన కళాశాలపై దువ్వాడ పోలీసులు కేసు నమోదు చేశారు. కూర్మన్నపాలెంలో ఓ విద్యా సంస్థ నిర్వాహకులు ముగ్గురు విద్యార్థులకు 2023–25 విద్యా సంవత్సరంలో ఇంటర్‌లో ప్రవేశం కల్పించింది. ఈ క్రమంలో అధిక మొత్తంలో ఫీజు వసూలు చేసింది. పరీక్షల సమయంలో విద్యార్థులకు నకిలీ హాల్ టికెట్లు మంజూరు చేసింది. పరీక్ష కేంద్రంలో అవి నకిలీవని తేలడంతో అసలు విషయం బయటపడింది. దీంతో విద్యార్థులు పోలీసులను ఆశ్రయించగా కేసు నమోదు చేశారు.

చిన్నారులను ఆదుకోండి

జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్

విశాఖ లీగల్: సమాజంలో అర్హులైన చిన్నారులకు, మహిళలకు చేయూతనివ్వాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్ పిలుపునిచ్చారు. శనివారం జిల్లా కోర్టులోని న్యాయ సేవా సదంలో న్యాయ సేవ ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం, మెగా అదాలత్ జరిగాయి. న్యాయమూర్తి ఈ రెండు కార్యక్రమాలను ప్రారంభిస్తూ సమాజంలో చిన్నపిల్లల సంరక్షణ చాలా అవసరమని.. ప్రతి న్యాయవాది వృత్తితో పాటు సేవా కార్యక్రమాలను కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. న్యాయవాదులు న్యాయస్థానాలకే పరిమితం కాకుండా కొంత సమయాన్ని చట్టాలపై అవగాహన కలిగించడం, న్యాయ సేవ ప్రాధికార సంస్థ నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో భాగస్వాములు కావడం ఎంతో అవసరమన్నారు. హైకోర్టు ఆదేశాల మేరకు ఈ నెలలో ప్రతిరోజు సేవా కార్యక్రమాలు జరుగుతాయని, వాటిలో పాల్గొనాలని కోరారు. ఇటీవల తాను ప్రత్యక్షంగా చూసిన వీధి వడ్డీ వ్యాపారస్తుల కేసుల్లో బలమైన సాక్ష్యాలు అందించడానికి కూడా సహకరించాలన్నారు. నగరంలో ప్రస్తుతం 20 వేలకు పైగా సీసీ కెమెరాలు పనిచేస్తున్నాయన్నారు. దాదాపు ప్రతి వ్యక్తి కదలికలు సీసీ కెమెరాలు నిక్షిప్తం అవుతున్నట్లు న్యాయమూర్తి తెలిపారు. ఇప్పటికే న్యాయవ్యవస్థలో 50 శాతానికి పైగా మహిళా న్యాయవాదులు, అధికారులు ఉన్నట్లు మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి ఎం.వెంకటరమణ చెప్పారు. పోక్సో కోర్టులో పబ్లిక్ ప్రాసిక్యూటర్లుగా మహిళా న్యాయవాదుల నియామకానికి సంబంధించి సూచన స్వీకరిస్తామన్నారు. ప్రధాన కుటుంబ న్యాయస్థానం న్యాయమూర్తి రాధాదేవి మాట్లాడుతూ మహిళలకు జరుగుతున్న అన్యాయాలపై న్యాయవాదులు పోరాడాలన్నారు. విశాఖ జిల్లా న్యాయసేవా ప్రాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ జడ్జి, ఎం.వి.శేషమ్మ అధ్యక్షత జరిగిన ఈ కార్యక్రమంలో విశాఖ న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు బెవర సత్యనారాయణ, రాష్ట్ర బార్ కౌన్సిల్ ఉపాధ్యక్షుడు ఎస్.కృష్ణమోహన్, లోక్‌అదాలత్ జాతీయ శిక్షకుడు రఘుపాత్రుని శ్రీనివాసరావు, లక్ష్మీరాంబాబు, నాగశ్రీ, అనురాధ తదితర సీనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

సమర్థంగా పీ4 సర్వే

కలెక్టర్‌కు జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆదేశం

మహారాణిపేట: పీ4 సర్వేపై ప్రజలకు అవగాహన కల్పించి, సమర్థవంతంగా నిర్వహించాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి కలెక్టర్‌ను ఆదేశించారు. పోర్టు గెస్ట్ హౌస్‌లో కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్, నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి శనివారం మంత్రిని కలిశారు. ఈ సందర్భంగా ఆయన జిల్లాలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలు గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా పీ4 సర్వే నిర్వహించాలన్నారు. ప్రజాభిప్రాయాలకు అనుగుణంగా సిటిజెన్ సర్వీసెస్ అమలు చేసి.. జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలని కలెక్టర్‌ను ఆదేశించారు. జిల్లాలో శాంతిభద్రతలపై సీపీతో చర్చించి.. మెరుగైన సేవలందించాలన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా ప్రజలకు అధికార యంత్రాంగం ఎల్లవేళలా అందుబాటులో ఉండాలని మంత్రి స్పష్టం చేశారు.



జిల్లా ఇన్‌చార్జి మంత్రితో భేటీ అయిన కలెక్టర్ హరేందిర ప్రసాద్, సీపీ శంఖబ్రత బాగ్చి

గ్రీన్‌పార్క్‌లో సంప్రదాయ వస్త్రాల ప్రదర్శన

దాబాగార్డెన్స్: ఉగాది పండగ పురస్కరించుకుని నగరంలో ప్రత్యేక వస్త్ర ప్రదర్శన ప్రారంభమైంది. వాల్తేర్ మెయిన్‌రోడ్డులోని హోటల్ గ్రీన్ పార్క్‌లో ఏర్పాటు చేసిన ఈ ఎక్స్‌పో ఈ నెల 12వ తేదీ వరకు కొనసాగుతుంది. సంప్రదాయ దుస్తులకు ప్రాధాన్యమిచ్చే వారికి ఇది ఒక చక్కటి వేదిక. సరికొత్త ఫ్యాషన్ వస్త్రాలతో పాటు అన్ని రకాల సంప్రదాయ దుస్తులు ఇక్కడ అందుబాటులో ఉన్నాయి. ముఖ్యంగా ఈ ప్రదర్శనలో మహిళలను ఆకట్టుకునేలా వివిధ రకాల దుస్తులు కొలువుదీరాయి. పట్టు చీరలు, కాటన్ వస్త్రాలు, సల్వార్‌లు, టాప్స్ వంటి వాటితో పాటు అనేక రకాల ఉపకరణాలు, డిజైనర్ దుస్తులు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. ప్రత్యేకంగా పోచంపల్లి, కలంకారి చీరలు, కోల్‌కత్తా, భాగల్‌పురి ప్రింట్లు, లక్నో చికాన్ వర్క్ చీరలు, బెనారస్ పట్టు చీరలు వంటివి ఇక్కడ లభిస్తున్నాయి. అంతేకాకుండా మగ్గాలపై నేసిన, రంగులు వేసిన, ముద్రించిన, ఎంబ్రాయిడరీ వస్త్రాలు ఒకే చోట అందుబాటులో ఉన్నాయి. మట్కా సిల్క్ చీరలు, మధ్యప్రదేశ్, పాట్లీ పల్లు, మల్బరీ సిల్క్, చందేరి చీరలు కూడా సరసమైన ధరలకే విక్రయిస్తున్నారు. ప్రతి రోజూ ఉదయం 11 నుంచి రాత్రి 8.30 గంటల వరకు ప్రదర్శన, విక్రయాలు ఉంటాయని, నగర ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు.



చీరను ప్రదర్శిస్తున్న యువతి

కేజీహెచ్‌లో పిల్లల కోసం అత్యాధునిక వైద్యం

నూతన పరికరాలతో మెరుగైన సేవలు

మహారాణిపేట: కేజీహెచ్‌లోని పీడియాట్రిక్ వార్డులో అత్యాధునిక వైద్య పరికరాలు అందుబాటులోకి వచ్చాయి. ఈ నూతన సౌకర్యాలు పిల్లల్లో వ్యాధులను క్షణాల్లో గుర్తించడంతో పాటు, మెరుగైన చికిత్సను అందించడానికి దోహదపడతాయని పిల్లల వార్డు విభాగాధిపతి డాక్టర్ చక్రవర్తి తెలిపారు. పాయింట్-ఆఫ్-కేర్ అల్ట్రాసౌండ్ (పీవోసీయూఎస్), 2డీ, ఈకో ప్రోబ్, న్యూరో సోనోగ్రఫీ వంటి అత్యాధునిక పరికరాలను ఏర్పాటు చేసినట్లు ఆయన చెప్పారు. ఈ పరికరాల ఏర్పాటులో రేడియాలజీ విభాగాధిపతి డాక్టర్ బుజ్జిబాబు అందించిన సహకారం వెలకట్టలేనిదని డాక్టర్ చక్రవర్తి అన్నారు. డాక్టర్ బుజ్జిబాబు సత్వర స్పందన, సహాయ సహకారాలు, సాంకేతిక మార్గదర్శకత్వం ఎంతో విలువైనవని కొనియాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్, సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్‌లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఇవీ ప్రయోజనాలు : నూతన పరికరాలు పలు పరీక్షలను వేగంగా నిర్వహించి, వ్యాధులను నిర్ధారించడంలో సహాయపడతాయి. తద్వారా అత్యవసర సమయాల్లో రోగులకు సత్వర చికిత్సను అందించవచ్చు. రక్తనాళాల స్థితిని అంచనా వేయడానికి, కష్టతరమైన ఇంట్రావీనస్ (ఐవీ) యాక్సెస్, ఇన్ఫీరియర్ వెనా కావా (ఐవీసీ) స్థితిని అంచనా వేయడానికి ఈ పరికరాలు ఉపయోగపడతాయి. గుండె సంబంధిత పరీక్షలు, హృదయ స్పందనల అంచనా, పెరికార్డియల్ ఎఫ్యూషన్, హీమోడైనమిక్ అస్థిరత్వాలను గుర్తించడానికి తక్షణ ఎకో కార్డియోగ్రఫీ సేవలు అందుబాటులో ఉంటాయి. నవజాత శిశువుల్లో మెదడు సంబంధిత వ్యాధులను గుర్తించడంలో న్యూరోసోనోగ్రఫీ పరికరం సహాయపడుతుంది. ఆకస్మిక కడుపు నొప్పి, అసిటీస్, కాలేయ సంబంధిత సమస్యలు, ప్రేగు వ్యాధులను బెడ్‌సైడ్ వద్దే పరీక్షించడానికి వీలుంటుందని డాక్టర్ చక్రవర్తి వివరించారు.



అల్ట్రా సౌండ్ పరికరాన్ని పరిశీలిస్తున్న సూపరింటెండెంట్ శివానంద్


గేమ్ చేంజర్‌గా నూతన పరికరాలు

ఈ అత్యాధునిక పరికరాలు పీడియాట్రిక్ వార్డులో గేమ్ చేంజర్‌గా మారనున్నాయని డాక్టర్ చక్రవర్తి అభిప్రాయపడ్డారు. రేడియాలజీ విభాగంపై ఆధారపడటాన్ని తగ్గిస్తాయి. అలాగే అత్యవసర పరిస్థితుల్లో రోగులను తరలించాల్సిన అవసరాన్ని కూడా తగ్గిస్తాయి. క్షణాల్లో వ్యాధి నిర్ధారణ జరగడం వల్ల, ప్రాణాపాయ స్థితిలో ఉన్న పిల్లలను కాపాడే అవకాశాలు మెరుగుపడతాయని ఆయన వెల్లడించారు.


బైక్ రేసర్లపై పోలీసుల ఉక్కుపాదం

16 మంది అరెస్ట్, బైక్‌ల సీజ్

బీచ్‌రోడ్డు: నగరంలో అర్ధరాత్రి బైక్ రేసులు నిర్వహిస్తున్న యువకులపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. వారం రోజుల కిందట 38 మంది యువకులను అరెస్ట్ చేసి వారి బైక్‌లను సీజ్ చేసిన పోలీసులు.. తాజాగా మరో 16 మందిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. మూడో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ట్రాఫిక్ విభాగం అదనపు డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ ప్రవీణ్ కుమార్ ఈ వివరాలు వెల్లడించారు. అర్ధరాత్రి నగరంలో రోడ్లపై హల్‌చల్ చేస్తూ పాదచారులు, వాహన చోదకులను బైక్ రేసర్లు ఇబ్బందులకు గురి చేస్తున్నారు. దీనిపై అందిన ఫిర్యాదుల మేరకు జోన్-1 ట్రాఫిక్ ఏసీపీ వాసుదేవరావు పర్యవేక్షణలో త్రీటౌన్, ద్వారకా, నార్త్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు పలు ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో 16 మంది బైక్ రేసర్లను అరెస్ట్ చేసి, 16 ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వారికి విధించే శిక్షల్లో సమూల మార్పులు చేసినట్లు వెల్లడించారు. కఠిన చర్యలతో పాటు భారీ జరిమానాలు కూడా విధిస్తామని హెచ్చరించారు. సమావేశంలో ట్రాఫిక్ సీఐ అమ్మినాయుడు తదితరులు పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న ట్రాఫిక్ ఏడీసీపీ



స్వాధీనం చేసుకున్న బైక్‌లు